శ్రీరామగిరిపై ఘనంగా శమీపూజ

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల్లో భాగంగా శ్రీరామగిరి రామాల యంలో తొలుత స్వామి వారికి అభిషేకా లుచేసి, పట్టువస్త్రాలు అలంకరించి, జమ్మి కొమ్మలు ఉంచి పూజలు చేశారు. కొండ దిగువన ఉన్న అమ్మవారి ఉత్సవ మండపం ఎదుట శమీవృక్షం కొమ్మలు ఉంచి అర్చకులు పురుషోత్తమాచార్యుల బృందం శాస్త్రోక్తంగా పూజచేసి, ఈ పూజా విశేషాన్ని భక్తులకు వివరించారు. అనంతరం చెడుపై మంచి విజయానికి సంకేతంగా అర్చకులు విల్లు ఎక్కుపె ట్టగా, భక్తుల రామనామస్మరణతో గ్రామం మార్మోగింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఊరేగించి గోదావరి నదిలో నిమజ్జనం చేశారు.


పాడేరులో అమ్మవారి ప్రతిమ ఊరేగింపు

పాడేరు పట్టణం: శరన్నవరాత్రుల ముగింపు వేడుకల్లో భాగంగా పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నుంచి సాయిబాబా గుడి వరకు అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆలయ ధర్మకర్త రొబ్బీ రాము ఆధ్వర్యంలో సమీప వాగులో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. వాగు వద్ద పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.


శ్రీరామగిరి దసరా ఉత్సవ మండపం వద్ద శమీవృక్షం వద్ద పూజలో భక్తులు, అర్చకులు

మన్యం కాఫీకి డిమాండ్

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: నాణ్యత, రుచిలో అంతర్జాతీయ ఖ్యాతిపొందిన మన్యం కాఫీ మార్కెటింగ్‌కు ప్రభుత్వ రంగ సంస్థలైన గిరిజన సహకార సంస్థ (జీసీసీ), సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలతోపాటు (ఐటీడీఏ) ప్రైవేటు సంస్థలు సైతం సిద్ధమవుతున్నాయి. ఒకప్పుడు కాఫీ గింజలకు మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో పెట్టుబడి కూడా చేతికి అందేది కాదు. తప్పనిసరి పరిస్థితుల్లో స్థానిక దళారీలకు విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు ప్రభుత్వ రంగ సంస్థలైన ఐటీడీఏ, జీసీసీ కాఫీ సాగుకు తగు ప్రోత్సాహం ఇవ్వడంతోపాటు పండించిన సరకుకు దేశీయంగా మంచి గుర్తింపు తీసుకొచ్చాయి. ఈ మార్పుతో జాతీయ, అంతర్జాతీయంగా కాఫీకి మంచి డిమాండు ఏర్పడింది. దీంతో టాటా, నాంది తదితర ప్రైవేటు సంస్థలు సైతం మార్కెటింగ్ చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ఫలితంగా మన్యం కాఫీకి మంచి డిమాండు పెరిగింది. మరో కొద్దిరోజుల్లో సీజన్ మొదలు కానున్న నేపథ్యంలో ఆయా సంస్థలు పోటీపడి మరీ మార్కెటింగ్ లక్ష్యాలు నిర్దేశించుకోవడం ఈ ఏడాది రైతులకు మంచి లాభాలు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయని మార్కెటింగ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.


మన్యంలో కాఫీ తోట

జీసీసీ, ఐటీడీఏ లక్ష్యాల నిర్దేశం

ఏజెన్సీ వ్యాప్తంగా ఏటా పది వేల టన్నుల కాఫీ గింజలు ఉత్పత్తి అవుతున్నాయి. వీటిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో భారీగా మార్కెటింగ్ చేస్తుంటారు. ప్రతి ఏటా డిసెంబర్ నెల నుంచి మార్చి చివరి వరకు కాఫీ ఉత్పత్తి తారాస్థాయిలో జరుగుతుంది. దీంతో జీసీసీ ఈసారి తన లక్ష్యాలను ముందే నిర్దేశించుకుని ముందుకు సాగుతోంది. ఈ ఏడాది రెండువేల టన్నుల పార్చ్‌మెంట్ కాఫీ గింజలు సేకరణ లక్ష్యంగా చేసుకోగా... అదే స్థాయిలో మరో రెండు వేల టన్నులు కొనుగోలు చేసేందుకు ఐటీడీఏ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇదికాక నాంది, టాటా, ఇతర ప్రైవేట్ సంస్థలు పార్చ్‌మెంట్, చెర్రీ కాఫీ సేకరించే పనిలో ఉన్నారు. దీంతో దళారీల బెడద తమకు తప్పుతోందని రైతులు అభిప్రాయ పడుతున్నారు. జీసీసీ డీఎం సింహాచలంను వివరణ కోరగా కాఫీ లక్ష్యాలను నిర్దేశించుకుని కార్యాచరణ రూపొందించామని చెప్పారు.

అరకులోయలో మరింత పర్యాటక అభివృద్ధి

అరకులోయ, న్యూస్‌టుడే: ఆంధ్రా ఊటీ అరకులోయను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్ తెలిపారు. పద్మాపురం ఉద్యానంలో హాట్ ఎయిర్ బెలూన్ (ట్రయల్‌రన్) శనివారం పీఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరకులోయకి ఏటా సుమారు మూడు లక్షల మంది వరకు పర్యాటకులు వస్తున్నారన్నారు. వీరందరికీ కొత్త సొగసులు అందుబాటులోకి తీసుకు రావాలనే ఉద్దేశంతో హాట్ ఎయిర్ బెలూన్ అందుబాటులోకి తీసుకు వస్తున్నామన్నారు. కొత్తవలస వ్యవసాయ ప్రదర్శన క్షేత్రంలో త్వరలో పారాగ్లైడింగ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. పద్మాపురం ఉద్యానంలో నూతనంగా ఐలవ్ అరకు అనే హోర్డింగ్ ఏర్పాటుచేస్తామన్నారు. పద్మాపురం ఉద్యానాన్ని రాత్రి 10 గంటల వరకు సందర్శకులు వీక్షించేందుకు వీలుగా ఫ్లడ్ లైట్లు, రోప్ లైట్లు, హెడ్ లైట్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉద్యానంలో జపనీస్ ఆర్ట్, వివిధ గార్డెన్‌లలో సెల్ఫీ పాయింట్ బోర్డుల ఏర్పాటుతోపాటు కాలిబాటలను అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. హాట్ ఎయిర్ బెలూన్ పర్యటనలను సుమారు 300 అడుగుల మేర పైకి తీసుకువెళ్లి మళ్లీ కిందకి దింపుతుంటారన్నారు. కొత్తపల్లి జలపాతం వద్ద లేజర్ లైటింగ్, కాలిబాట ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొత్తపల్లి, కొత్తవలస జలపాతాలను చాపరాయి మాదిరిగా అభివృద్ధి చేస్తామన్నారు. హాట్ ఎయిర్ బెలూన్‌ని వీక్షించేందుకు పెద్ద ఎత్తున పర్యాటకులు తరలివచ్చారు. నిర్వాహకుడు సంతోష్, ఐటీడీఏ పర్యటక శాఖాధికారి మురళి, ఉద్యానం మేనేజర్ బొంజుబాబు, గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ ఏఈఈ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.


అరకులోయలో ఎగురుతున్న హాట్ ఎయిర్ బెలూన్


హాట్ ఎయిర్ బెలూన్ వద్ద ఐటీడీఏ పీఓ అభిషేక్

తెదేపా కార్యకర్తపై దాడి

అడ్డతీగల, న్యూస్‌టుడే: అడ్డతీగల మండలం డి.భీమవరం గ్రామంలో దసరా సందర్భంగా జరిగిన ఊరేగింపులో పలువురి మధ్య ఘర్షణ... కొట్లాటకు దారితీసింది. ఈ ఘటనలో తెదేపా కార్యకర్త చెక్కా అప్పారావు రెడ్డిని అదే గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు తలపై కొట్టడంతో గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినోద్ ఆదివారం తెలిపారు.


అప్పారావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ

తెదేపా కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. అడ్డతీగల మండలం డి.భీమవరంలో తెదేపా కార్యకర్తపై వైకాపా నాయకులు దాడి చేయడమేంటని ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. వైకాపా నాయకుల దాడిలో గాయపడి స్థానిక సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న చెక్కా అప్పారావురెడ్డిని ఆమె ఆదివారం పరామర్శించి, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. వైద్యులతో మాట్లాడి క్షతగాత్రుడికి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెదేపా కార్యకర్తలు ఎటువంటి తగాదాలకు పోకపోయినా సమన్వయంతో ముందుకు సాగుతుంటే, అటువంటి వారిపై వైకాపా నాయకులు దాడి చేయడం సమంజసం కాదన్నారు. తెదేపా కార్యకర్తపై దాడి చేసిన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే అనంతబాబు అండ చూసి వైకాపా కార్యకర్తలు చెలరేగిపోతున్నారు. దీనిని ఉపేక్షించబోమని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఇలా దాడులు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఆమెవెంట కూటమి నాయకులు పుడిగి ఆదిలక్ష్మి, బాలయోగి, సాగర్, రాజేంద్ర, అప్పారావు, సత్యవతి పాల్గొన్నారు.

టేకు చెట్ల నరికివేతపై పోలీసుల విచారణ

దేవీపట్నం, న్యూస్‌టుడే: అనుమతులు లేకుండా టేకు చెట్ల నరికివేసిన ఘటనపై పోలీసులు సైతం విచారణ ప్రారంభించారు. దేవీపట్నం మండలం చినరమణయ్యపేట - సీతారం గ్రామాల మధ్య ఓ పంట పొలంలో చెరువు గట్టుపై ఉన్న టేకు చెట్లు ఇటీవల నరికివేతకు గురైన సంగతి తెలిసిందే. రంపచోడవరం సీఐ ఆర్.జె.రవికుమార్ విచారణ నిర్వహించి వీఆర్వోను వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్న, పెద్ద మొత్తం 59 చెట్లు నరికివేశారని వీఆర్వో సీఐ దృష్టికి తీసుకెళ్లారు. పంట పొలానికి సంబంధించిన రైతు వివరాలు తెలియజేశారు. ఇంత పెద్ద మొత్తంలో టేకు చెట్లు రవాణాకు సహకరిస్తూ.. గోదావరి నదిలో పడవలు తిప్పే వ్యక్తులపై అటవీ శాఖతోపాటు పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ దిశగా అధికారులు విచారణ ప్రారంభించారు. రూ. లక్షల విలువచేసే టేకు కలప అనుమతులు లేకుండా అటవీశాఖ అధికారుల కళ్లు గప్పి తరలించడంపై ఆ శాఖ ఉన్నత స్థాయి అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ సెక్షన్ పరిధిలోని అధికారులపై వేటు పడే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.


వీఆర్వోను వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీఐ రవికుమార్

జోరు.. తగ్గని హుషారు!

స్కేటింగ్‌లో అదరగొడుతున్న నర్సీపట్నం చిన్నారులు

నర్సీపట్నం, న్యూస్‌టుడే

నర్సీపట్నం బాలలు స్కేటింగ్ క్రీడలో పట్టణానికి పేరు తెస్తున్నారు. ఇప్పటికే ఎందరో వీటిలో పతకాలు గెలుపొందారు. ఇప్పుడు ఏకంగా ఎనిమిది మంది చిన్నారులు రాష్ట్ర స్థాయి పురస్కారాలు అందుకోవడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఒకటి నుంచి అయిదో తరగతి వరకు చదువుతున్న వీరంతా ఈ క్రీడలో తమకు తామే సాటి అని నిరూపించుకుంటున్నారు.

ఇటీవల కాకినాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఓపెన్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో నర్సీపట్నం నుంచి మొత్తం 16 మంది బాలలు పాల్గొన్నారు. వీరిలో 8 మంది స్వర్ణ, రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. ఏడు నుంచి తొమ్మిదేళ్ల లోపు వయసు కేటగిరిలో రింక్, రోడ్డు విభాగాల్లో ఒక్కొక్కరు రెండు మూడు పతకాలు సొంతం చేసుకున్నారు. చిన్న వయసులోనే వీరుచూపిన ప్రతిభ వీరికి చక్కటి అవకాశాన్ని తెచ్చిపెట్టింది. త్వరలో అఖిల భారత స్కేటింగ్ సమాఖ్య ఆధ్వర్యంలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొనే సదవకాశం వీరిని వరించింది. ఇందులో సత్తా చాటేందుకు ఇప్పటి నుంచే ప్రత్యేక సాధన చేస్తున్నారు.



రెండు స్వర్ణాలతో..: నాతవరం మండలంలోని ములగపూడికి చెందిన అనిష్ నాలుగో తరగతి చదువుతున్నాడు. గత కొంత కాలంగా నర్సీపట్నంలోని రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నాడు. తండ్రి అర్జున ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. కాకినాడలోని 500 అలాగే 1000 మీటర్ల రింక్ పోటీల్లో రెండు స్వర్ణ పతకాలు గెలుపొందాడు. రోడ్డు విభాగంలో ఒక రజతాన్ని సొంతం చేసుకున్నాడు. ఇప్పుడు జాతీయ పోటీలపై గురి పెట్టి సాధన చేస్తున్నాడు.

వేగమే ప్రత్యేకత



నాలుగో తరగతి విద్యార్థిని శ్రీ ఆద్య స్కేటింగ్‌లోని వేగం అందరిని అబ్బురపరుస్తుంది. నర్సీపట్నంలోని అమరావతి స్కూల్‌లో చదువుతోంది. ఈమె తండ్రి భవానీ ప్రసాద్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ఈ బాలికకు కాకినాడ పోటీల్లో రోడ్డు అలాగే వెయ్యి మీటర్ల రింక్ విభాగాల్లో రెండు బంగారు పతకాలు లభించాయి. 500 మీటర్ల రింక్‌లో ఒక రజతం గెలుపొందింది. పత్రికల్లో స్కేటింగ్ విజేతల గురించి చదివి ఈ క్రీడ పట్ల మక్కువతో నర్సీపట్నంలో గత ఏడాదిగా శిక్షణ పొందుతోంది.



సాటిరారెవరు: నాల్గో తరగతి విద్యార్థి సాత్విక్ తనకు ఎవరూ సాటి రారని నిరూపించుకుంటున్నాడు. నర్సీపట్నంలోని విద్యాంజలిలో చదువుతున్న ఈ బాలుడు తల్లిదండ్రుల ప్రోత్సాహంతో స్కేటింగ్‌లో శిక్షణ పొందుతున్నాడు. గతంలో జిల్లా స్థాయి పోటీల్లో పతకాలు సాధించాడు. చదువులో రాణిస్తూనే ఈ క్రీడలోనూ దూసుకుపోతున్నాడు. కాకినాడ పోటీల్లో రోడ్డు, 500 మీటర్ల రింక్ విభాగాల్లో రెండు రజత పతకాలను సొంతం చేసుకున్నాడు. జాతీయ పోటీల్లో పతకం లక్ష్యంగా సాధన చేస్తున్నాడు.

ఏడేళ్లకే మూడు పతకాలు



నర్సీపట్నానికి చెందిన మాన్వితకు కాకినాడ పోటీల్లో మూడు పతకాలు లభించాయి. అమరావతి స్కూల్‌లో రెండో తరగతి చదువుతోంది. ఏడు నుంచి తొమ్మిది ఏళ్ల లోపు విభాగంలో రోడ్డు, వెయ్యి మీటర్ల రింక్‌ల్లో రెండు రజతాలు లభించాయి. 500 మీటర్ల రింక్‌లో ఒక కాంస్య పతకం దక్కింది. తండ్రి ఉదయ్ వ్యాపారి. ఏడేళ్ల వయసులోనే అత్యంత వేగంగా రింక్‌లో దూసుకుపోతున్న ఈ చిన్నారి విన్యాసం ఆకట్టుకుంటోంది.


నర్సీపట్నంలో బాలల స్కేటింగ్ సాధన

తొలుతే విజయం



సాయి కిడ్స్ క్యాంప్ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్న విషాంక్‌కు స్కేటింగ్‌లో తొలి ప్రయత్నంలోనే విజయం వరించింది. ఇతడి తండ్రి రాజేంద్ర ప్రసాద్ వ్యాపారి. ఏడాదిన్నరగా ఈ క్రీడలో సాధన చేస్తున్నాడు. రాష్ట్ర స్థాయి పోటీల్లో తొలిసారిగా పాల్గొని రింక్ పోటీల్లో రజత పతకాన్ని సాధించాడు.

విన్యాసాల్లో దిట్ట



చిన్న వయసులోనే స్కేటింగ్‌లో పలు విన్యాసాలతో అందరిని ఆకట్టుకుంటోంది తన్విక. నర్సీపట్నంలోని శ్రీ చైతన్య ఆంగ్ల మాధ్యమం పాఠశాలలో అయిదో తరగతి చదువుతోంది. నర్సీపట్నంలోని రింక్‌లో రయ్ రయ్ మని దూసుకుపోతున్న చిన్నారులను చూసి ఈ క్రీడలో శిక్షణకు చేరింది. ఏడాదిగా సాధన చేస్తూ జిల్లా పోటీల్లో పతకాలు సాధించింది. కోచ్ ప్రత్యేక తర్ఫీదుతో ఇప్పుడు కాకినాడలో వెయ్యి మీటర్ల రింక్‌లో ఒక రజతం, రోడ్డులో కాంస్య పతకాన్ని గెలుపొందింది. విన్యాసాలకు తోడు వేగం ఈ చిన్నారి ప్రత్యేకత.

స్కేటింగ్‌లో 'రాజా'



నర్సీపట్నంలోని విద్యాంజలి పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న ఈ బాలుడి పేరు రాజా రుషిక్. స్కేటింగ్‌లో రాజాగా అందరూ ఆ చిన్నారిని కొనియాడుతుంటారు. తోటి పిల్లలు స్కేటింగ్‌లో రాణించడం చూసి రింక్‌లో శిక్షణకు చేరాడు. జిల్లా పోటీల్లో పతకాలు గెలుపొందాడు. ఇప్పుడు కాకినాడలోని 500 మీటర్ల రింక్ పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించాడు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం కోసం మరింత సాధన చేస్తున్నాడు.

నేటి నుంచి పర్యటక ప్రాంతాల సందర్శనపై నిషేధం

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం ఏజెన్సీలోని పర్యటక ప్రాంతాల సందర్శనకు ఈ నెల 14 నుంచి 17 వరకు అనుమతులు లేవని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ పేర్కొన్నారు. తుపాను ప్రభావంపై ఆదివారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో మీడియాతో వారు మాట్లాడారు. ఈ మూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున పర్యాటకులు ఎవరూ రావద్దని సూచించారు.
అల్పపీడన ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు పడనున్న దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పేర్కొన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 14, 15, 16 తేదీల్లో భారీ వర్షాలు పడతాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. దీంతో నియోజకవర్గంలో ప్రజలంతా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని ఇళ్ల నుంచి ఎవరూ బయటకు రావద్దని సూచించారు. విపత్తును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సన్నద్ధమైందన్నారు.

భుజాన భారం.. కొండంత దూరం



అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: అనంతగిరి మండలం పెదకోట పరిధిలోని నక్కులమామిడి గ్రామనికి చెందిన ఆదివాసీ కుటుంబాల వారు ప్రతినెలా రేషన్ సరకులు తీసుకుని గ్రామానికి కాలినడకనే వెళ్లాల్సి వస్తోంది. నక్కులమాడిలో సుమారు 100 కుటుంబాల గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. గ్రామానికి చేరుకునేందుకు రహదారి మార్గం లేకపోవడంతో రేషన్ సరకులు మోసుకుని కాలినడక గ్రామానికి చేరుకునే పరిస్థితి ఉందని గ్రామస్థులు రాము తెలిపారు. అధికారులు చర్యలు తీసుకుని మా గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


చిన్న పరిశ్రమకు దన్ను

అచ్యుతాపురం సెజ్‌లో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణం

ఒకేచోట బహుళ తయారీ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహం

ఈనాడు, అనకాపల్లి, అచ్యుతాపురం, న్యూస్‌టుడే

అచ్యుతాపురం సెజ్‌లో ప్రస్తుతం భారీ, మధ్యతరహా పరిశ్రమలే ఎక్కువ ఉన్నాయి. వాటికి అనుబంధంగా చిన్నచిన్న కంపెనీలు పెట్టడానికి అవకాశం ఉంది. అయితే అక్కడి భూముల విలువ, నిర్మాణాలకు అయ్యే పెట్టుబడి భారీగా ఉండడంతో ఔత్సాహికులు ముందుకు రాలేకపోతున్నారు. ఇలాంటి వారి కోసం కూటమి ప్రభుత్వం ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఎఫ్ఎఫ్‌సీ)ను అందుబాటులోకి తెస్తోంది. పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే ఆలోచన, పట్టుదల, సాంకేతిక అంశాలపై అవగాహన ఉన్నవారికి అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి ఏర్పాట్లు చేస్తోంది. బహుళ తయారీ యూనిట్లు అన్నీ ఒకే చోట ఏర్పాటు చేసుకునేలా ఏపీఐఐసీ ద్వారా మౌలిక వసతులు కల్పించనుంది. వైకాపా హయాంలో రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వక చతికిలపడిన పారిశ్రామిక రంగాన్ని ముందుకు నడిపించేందుకు అధికారులు అడుగులు వేస్తున్నారు.


అచ్యుతాపురంలో నిర్మిస్తున్న ఫ్యాక్టరీ సముదాయం

అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో ప్రత్యేక ఆర్థికమండలి (సెజ్)ని 9,297 ఎకరాల్లో ఏర్పాటుచేశారు. దీన్ని ఏర్పాటుచేసినా, అప్పటి వైఎస్ఆర్ ప్రభుత్వం పరిశ్రమలను తీసుకొచ్చే దిశగా దృష్టి పెట్టలేదు. అన్నదాతల వద్ద బలవంతంగా సేకరించిన భూములు చాలాకాలం ఖాళీగానే ఉండిపోయాయి. రాష్ట్ర విభజన తర్వాత తెదేపా ప్రభుత్వం ఇక్కడ ఖాళీ భూముల్లో 2,200 ఎకరాలను డీనోటిఫై చేసి సెజ్ నుంచి తప్పించింది. దీంతో నాన్ సెజ్ ఏరియాలో భారీగా పరిశ్రమలు వచ్చాయి. గతంలో తెదేపా ప్రభుత్వం కృషితో ఏషియన్ పెయింట్స్, సెయింట్ గొబైన్, ఇండియన్ ఆయిల్, పెప్సీ, లారస్, ఎంఎస్ఎంఈ శిక్షణా కేంద్రం వంటి ప్రతిష్ఠాత్మకంగా సంస్థలు ఇక్కడ అడుగు పెట్టాయి. తాజాగా రూ 15.29 కోట్లతో నిర్మిస్తున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ చిన్న పరిశ్రమలకు దన్నుగా నిలవనుంది. పెట్టుబడి భారం తగ్గించేలా ప్లగ్ ప్లే విధానంలో యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా సదుపాయాలను కల్పించబోతున్నారు.



సెజ్‌కి నూతన కళ..

అచ్యుతాపురం నాన్ సెజ్‌లో 5 ఎకరాల పరిధిలో చిన్న చిన్న తయారీ యూనిట్లు ఏర్పాటుకు వీలుగా ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. దీని నిర్మాణానికి మైక్రో అండ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎంఎస్ఈ-సీడీపీ) కింద కేంద్రం రూ.11.86 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ. 3.23 కోట్లు సమకూర్చుతున్నాయి. ప్రస్తుతం రూ. 5.20 కోట్లతో భవనాల నిర్మాణ పనులు చేపట్టారు. 40 యూనిట్లు ఏర్పాటు చేయడానికి వీలుగా రెండు బ్లాక్‌లుగా నిర్మిస్తున్నారు. ఈ ఏడాది నవంబర్‌లోగా వీటిని పూర్తిచేయనున్నారు.

వీటి ద్వారా ఖాళీ స్థలాలకు మోక్షం కలగడంతో పాటు సెజ్‌లకు కొత్త కళ రాబోతోంది. ఈ ఎఫ్ఎఫ్‌సీ ద్వారా రూ.120 కోట్ల వరకు పెట్టుబడులు, 250 మందికి ప్రత్యక్షంగా, మరో 200 మందికి పరోక్షంగా ఉపాధి లభించే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.



అనుబంధ పరిశ్రమలకు అవకాశం: పరిశ్రమలు పెట్టాలనే ఆలోచన, సాంకేతిక అంశాలపై అవగాహన ఉన్నవారు ముందుకొస్తే ఎఫ్ఎఫ్ సముదాయంలో సౌకర్యాలు కల్పిస్తాం. ఇప్పటికే ఉన్న పరిశ్రమలకు అనుబంధంగా యూనిట్లు నెలకొల్పడానికి ఈ కాంప్లెక్స్ ఉపయోగపడుతుంది. అయిదెకరాల్లో రెండు బ్లాక్‌లుగా 40 యూనిట్లను ఏర్పాటుచేస్తున్నాం. దీని వల్ల పారిశ్రామిక ప్రగతి పరుగులు పెట్టే అవకాశం ఉంటుంది. చిన్న పరిశ్రమలకు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటుంది.

–హరిప్రసాదరావు, జడ్ఎం, ఏపీఐఐసీ, అచ్యుతాపురం

నేడు 40 మద్యం దుకాణాలకు లాటరీ

పాడేరు, న్యూస్‌టుడే: లాటరీ ద్వారా మద్యం దుకాణాల ఎంపికకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అబ్కారీ శాఖ సహాయ కమిషనర్ మహేష్ కుమార్ తెలిపారు. పాడేరు జిల్లా కేంద్రంలోని వీఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం లాటరీ తీయనున్నారు. కార్యక్రమ నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 40 మద్యం దుకాణాలకు 1,205 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. లాటరీ కేంద్రం వద్దకు వచ్చేవారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 8 గంటలకు లాటరీ ప్రక్రియను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఎంపికైన మద్యం దుకాణదారులు ఈ నెల 16వ తేదీ నుంచి దుకాణాలు నిర్వహించుకునే అవకాశం ఉందని చెప్పారు.

శ్మశానాల అభివృద్ధికి అదనంగా నిధులు : అయ్యన్న



అయ్యన్నను పూలమాలతో సత్కరిస్తున్న పీలాగోవింద సత్యనారాయణ

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: పల్లె పండగ - పంచాయతీ వారోత్సవాలను సోమవారం నుంచి సందడి వాతావరణంలో నిర్వహించాలని శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు సూచించారు. నర్సీపట్నం నియోజకవర్గ నాయకులు, పంచాయతీరాజ్ అధికారులతో ఆదివారం సాయంత్రం సమావేశమయ్యారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ. 13 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులన్నీ జనవరిలోగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. రహదారులు, శ్మశానాల అభివృద్ధికి అదనంగా నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. మండలానికి పది శ్మశానాలను తొలి విడతలో అభివృద్ధి చేయాలని సూచించారు. వారం రోజుల్లోగా ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు. అనంతరం సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలపై తెదేపా నాయకులకు దిశానిర్దేశం చేశారు. త్వరలో మార్కెట్ కమిటీకి పాలకవర్గాన్ని నియమించనున్నట్లు చెప్పారు. జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, పంచాయతీరాజ్ డీఈఈ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్నతో పీలా గోవిందు భేటీ

శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఏపీ అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ఆదివారం భేటీ అయ్యారు. సంస్థ పరంగా ప్రస్తుత ప్రణాళికలు, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రతిపాదనలు తదితర అంశాలను అయ్యన్నకు వివరించారు. ఆయన వెంట తెదేపా కశింకోట మండల అధ్యక్షుడు కాయల మురళీధర్, కార్యకర్తలు ఉన్నారు.

పండగ వేళ పోటెత్తారు

పర్యటక కేంద్రాల్లో సందర్శకుల తాకిడి

అరకులోయ/ పట్టణం, పాడేరు, చింతపల్లి, డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

దసరా సెలవులు ఉల్లాసంగా గడిపేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులతో శని, ఆదివారాల్లో మన్యంలో పర్యటక కేంద్రాలు సందడిగా మారాయి. ఆదివారం మన్యం వ్యాప్తంగా ఉదయం ఎనిమిది గంటల వరకు మంచు దుప్పటి కమ్మేసింది.

★ అరకులోయలోని గిరిజన మ్యూజియం, పద్మాపురం ఉద్యానం, కాఫీ తోటలు కళకళలాడాయి. ★ మాడగడ సన్‌రైజ్ పాయింట్ వద్ద ఉషోదయ సమయాన్ని చూసేందుకు పర్యటకులు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. కొండపై నుంచి దిగువనున్న మాడగడ గ్రామం పాలసముద్రంలా కనిపించే పొగమంచు మబ్బుల మధ్య ఉదయించే ఉషోదయాన్ని వీక్షించారు. ★ పాడేరు మండలం వంజంగి మేఘాల కొండల్లో మంచు అందాలు కట్టిపడేశాయి. సూర్యోదయంలో కొండలను మేఘాలు ఆవరించి చూపరులకు ఆకర్షించాయి. మేఘాల కొండ సందర్శనను పర్యటక కార్పొరేషన్ సభ్యుడు కిల్లు రమేష్‌నాయుడు ప్రారంభించారు.

★ చింతపల్లి మండలం లంబసింగికి చేరువలోనే ఎత్తయిన కొండపై ఉన్న ఆదివాసీ గిరి పల్లె చెరువులవేనంలో సహజసిద్ధ మంచు అందాలను ఆస్వాదించేందుకు పర్యటకులు భారీగా తరలివచ్చారు. ★ చాపరాయి జలవిహారి, సినిమా చిత్రీకరణకు అనువైన పర్యటక కేంద్రం అంజోడ సిల్క్‌ఫాం పీనరి, కొల్లాపుట్టు జలతరంగిణిలో పర్యటకులు కిక్కిరిసిపోయారు. జలవిహారిలో థింసా నృత్యాలు ఆస్వాదిస్తూ, స్నానాలతో పర్యటకులు ఆనందంగా గడిపారు.

పాడేరు పట్టణం: సముద్ర మట్టానికి 3500 అడుగుల ఎత్తులో ఉన్న డల్లాపల్లి అందాలు తిలకించేందుకు సందర్శకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మంచు అందాలను ఆస్వాదించారు. పర్యటకులంతా మోదకొండమ్మ అమ్మవారి పాదాలను దర్శించుకుని డల్లాపల్లి అందాలను వీక్షించి ప్రత్యేక అనుభూతిని పొందారు.



చాపరాయి జలవిహారిలో సందడి



చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద పర్యటకులు



వంజంగి మేఘాల కొండపై..



మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్ వద్ద..



డల్లాపల్లి పరిసరాల్లో మంచు అందాలు


ప్రారంభమైన పాపికొండల విహారం

వరరామచంద్రాపురం: పాపికొండల విహారయాత్రను దసరా పర్వదినం శనివారం రోజున నిర్వాహకులు ప్రారంభించారు. మొదటిరోజు మొత్తం 122 మందితో రెండు బోట్లు పాపికొండలు వెళ్లాయి. అయిదు బోట్లలో 340మంది ఆదివారం ప్రకృతి అందాలు వీక్షించారని పోచవరం పర్యాటక కంట్రోల్ రూమ్ మేనేజర్ రాజేశ్ తెలిపారు.



గోదావరిలో బోట్‌లో విహరిస్తున్న పర్యాటకులు

జి.మాడుగుల, న్యూస్‌టుడే: కొత్తపల్లి జలపాతంలో పర్యటకులు సందడి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యటకులు జలపాతంలో ఆనందోత్సాహాలతో గడిపారు. జలపాతం నీటిలో దిగి స్నానాలు చేశారు.



ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి వేల్పులవీధిలో గౌరీపరమేశ్వరుల ఆలయం వద్ద దసరా వేడుకల్లో భాగంగా చిన్నారుల భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఈ ప్రదర్శనను తిలకించి చిన్నారులను అభినందించారు. ముందుగా జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద ప్రత్యేక పూజలు చేసిన కొణతాల పలువీధుల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాల వద్ద అమ్మవార్లను దర్శించుకున్నారు.



చిన్నారులతో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపిక

నర్సీపట్నం, న్యూస్‌టుడే: నర్సీపట్నంకు చెందిన **కామిరెడ్డి దుష్య సాత్విక్** రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. విశాఖపట్నంలో రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో రాణించి ఏడు నుంచి తొమ్మిదేళ్ల కేటగిరీలో 250 మీటర్ల రింక్‌లో రజతం, 750 మీటర్ల రింక్, రోడ్డు విభాగాల్లో కాంస్య పతకాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. విద్యాంజలి పాఠశాల ఛైర్మన్ అక్షజ్ కృష్ణ, కరస్పాండెంట్ శాంతి సాత్విక్‌ను ఆదివారం అభినందించారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రేవతి ప్రతిభ


అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: హిమాచల్‌ప్రదేశ్‌లో ఈనెల 6 నుంచి 13వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో అనకాపల్లి జిల్లా క్రీడాకారిణి ప్రతిభ చూపారు. దేవరాపల్లికి చెందిన రేవతి జూనియర్ విభాగంలో తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు. ఈమెను జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి జి.వెంకటరామ తదితరులు అభినందించారు.



తృతీయస్థానంలో నిలిచిన రేవతి

స్నేహితుడితో భోజనం చేసేందుకు వెళ్తూ..

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



మాకవరపాలెం, న్యూస్‌టుడే: పండగ రోజున చిన్ననాటి స్నేహితుడిని కలిసేందుకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఒకరు శనివారం సాయంత్రం అన్నవరపాలెం వచ్చారు. రాత్రి వరకు కబుర్లు చెప్పుకొన్నారు. ఎనిమిది గంటల సమయంలో హోటల్‌కు వెళ్లి భోజనం చేసేందుకు బైక్‌పై ఇద్దరూ బయలుదేరారు. కొండల అగ్రహారం నల్లమారమ్మ ఆలయం సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై మృత్యువాత పడ్డాడు. స్నేహితుడు స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఎస్సై దామోదర్‌నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. కోటవురట్ల మండలం జల్లూరుకు చెందిన **లాలం స్వామి** (25) విశాఖపట్నంలోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. పండగకు ఇంటికి వచ్చిన ఆతడు అన్నవరపాలెంలోని స్నేహితుడు గంగాధర్‌ను కలిసేందుకు వచ్చారు. హోటల్‌లో భోజనం చేసేందుకు బైక్‌పై మాకవరపాలెం వెళ్తుండగా కొండల అగ్రహారం నల్లమారమ్మ ఆలయ సమీపంలో కోళ్లలోడుతో వెళ్తున్న లారీని తప్పించే క్రమంలో ప్రమాదానికి గురయ్యారు. లారీ చక్రాల మీదుగా వెళ్లడంతో స్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. లారీని తప్పించే క్రమంలో వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీకొనడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్వల్ప గాయాలైన గంగాధర్ పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

జలగలమదుం వద్ద వివాహిత..

అనకాపల్లి పట్టణం: జాతీయ రహదారిపై జలగలమదుం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతిచెందింది. ట్రాఫిక్ ఎస్సై శేఖరం కథనం ప్రకారం.. గవరపాలెం అరుంధతినగర్‌కు చెందిన మునగపాక అప్పారావు, నాగమణి కొప్పాక వద్ద ఏలేరు కాలువలో దుర్గాదేవి ప్రతిమను నిమజ్జనం చేసేందుకు వెళ్లారు. బైక్‌పై తిరిగి వస్తుండగా లారీ ఢీకొనడంతో నాగమణి (52) అక్కడికక్కడే మృతిచెందింది. గాయపడిన అప్పారావును పోలీసులు ఆసుపత్రికి తరలించారు.

ఆదమరిచేలా చేసి.. దోచేసి..

గండేపల్లి, న్యూస్‌టుడే: సాధారణ ప్రయాణికుల్లా ఆటోలు, బస్సులు ఎక్కుతారు.. పక్కనున్న వారిని ఆదమరిచేలా చేస్తారు. అనంతరం బంగారు ఆభరణాలు, నగదు, సెల్‌ఫోన్, విలువైన వస్తువులు దోచుకుంటారు. ఇలాంటి చోరీల్లో ఆ మహిళల ఆటోలోకి వారికి సహాయకుడిగా మరో వ్యక్తి ఉన్నారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలో చోరీ చేస్తూ దొరికిపోయిన మహిళను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేయడంతో ముఠా గుట్టురట్టయింది. అంతర్ జిల్లాలకు చెందిన నలుగురు మహిళలు, ఒక వ్యక్తిని పట్టుకుని వారి నుంచి విలువైన బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నానికి చెందిన మహిళ ఈనెల 7వ తేదీన పిల్లలతో కలిసి ఏలేశ్వరంలోని తన అక్క ఇంటికి వచ్చారు. అనంతరం ఆమె ఆటో ఎక్కి మూరా గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి వెళ్తుండగా అదే ఆటోలో ఎక్కిన మహిళ ఈమెతో మాటలు కలిపి బ్యాగ్‌లోని బంగారు వస్తువులను దోచుకుంది. దీనిపై ఈనెల 11న గండేపల్లి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తులో భాగంగా చోరీకి పాల్పడిన అనకాపల్లి జిల్లా మాడుగులకు చెందిన రావుల దుర్గ (40)తో పాటు అదే ప్రాంతానికి చెందిన మెరకనపల్లి వెంకటేశ్వరరావు (50), విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన గంటా రేవతి (25), అనకాపల్లి జిల్లా కె.కోటపాడుకు చెందిన రావుల వసంత, గోకవరం డ్రైవర్స్‌కాలనీకి చెందిన నాగులూరి శివపార్వతి (30)ని పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.5 లక్షల విలువైన 100 గ్రాముల బంగారు అభరణాలు, కారు, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా సభ్యులు గతంలో విశాఖ, గుంటూరు, కాకినాడ, రాజమహేంద్రవరం, నెల్లూరులో చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. ఎస్సై శివనాగబాబు, ఏఎస్సై శేఖర్, సిబ్బంది ఉన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు అభరణాలు, సెల్‌ఫోన్లు

చీడికాడ పొలాల్లో భారీ కొండచిలువ అలజడి

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ బొడ్డు వారి పొలాల్లో ఆదివారం సాయంత్రం భారీ కొండచిలువ అలజడి సృష్టించింది. రైతులు పొలాల్లో పనిచేస్తుండగా కొండచిలువ కనిపించింది. చూసిన వారంతా భయంతో పరుగులు తీశారు. కొంతసేపటి తర్వాత అటవీ శాఖ సిబ్బంది ద్వారా చీడికాడలోని తూర్పు కనుమల వన్యప్రాణి సంసరక్షణ సంస్థ ప్రతినిధులకు సమాచారం అందించారు. వరి పొలంలో దూరిన కొండచిలువను ఎంతో శ్రమించి పట్టుకున్నారు. దీని పొడవు 10 అడుగుల వరకు ఉంటుందని సంస్థ ప్రతినిధి ప్రసాద్ 'న్యూస్‌టుడే'తో చెప్పారు. కోనాం శివారు అటవీ ప్రాంతంలో దీన్ని విడిచిపెట్టామన్నారు.



పొలాల్లో పట్టుబడిన భారీ కొండచిలువ

9 తులాల బంగారం, నగదు అపహరణ

కోటవురట్ల, న్యూస్‌టుడే: పట్టపగలు ఓ ఇంట్లో జరిగిన చోరీలో సుమారు 9 తులాల బంగారం, 15 తులాల వెండి, రూ. 49 వేల నగదు చోరీ అయ్యాయి. ఈ సంఘటన నీలిగుంట పంచాయతీ శివారు జి.సన్యాసిరాజుపాలెంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రామకృష్ణ బ్యాంకులో పొరుగు సేవల ఉద్యోగిగా పని చేస్తున్నారు. ఇతను దసరా పండగకు అత్తవారి ఇంటికి వెళ్లారు. ఇంటి దగ్గర ఉన్న రామకృష్ణ తల్లి నాగరత్నం ఆదివారం పొలంలోకి వెళ్లింది. ఇంటి దగ్గర ఎవరూ లేకపోవడంతో, తలుపులకు ఉన్న గడియను పగలగొట్టి దొంగలు లోపలకు ప్రవేశించారు. బీరువాలో ఉన్న బంగారం, నగదును దోచుకుపోయారు. పొలం నుంచి ఇంటికి వచ్చిన నాగరత్నం తెరిచి ఉన్న బీరువా తలుపులు, చెల్లాచెదురుగా ఉన్న దుస్తులను చూసి అత్తవారి ఇంటికి వెళ్లిన కుమారుడికి చెప్పింది. ఇంటికి వచ్చిన రామకృష్ణ ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్.రాయవరం ఎస్సై విభీషణరావు, క్లూస్ టీం సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. అపహరణకు గురైన బంగారం, వెండి ఆభరణాల వివరాలు నమోదు చేసుకున్నారు.



చిందరవందరగా పడేసిన దుస్తులు

బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: దసరా వేడుకల్లో భాగంగా ఎస్పీ ఎం.దీపిక కుమారుడు తవిష్‌తో కలిసి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. విశాఖపట్నంలోని కైలాసగిరిలోని ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ హెడ్‌క్వార్టర్స్‌లో దసరా రోజు ఆయుధ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థలో ఆయుధాలు ఒక భాగమన్నారు. వీటికి గౌరవమిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. అదనపు ఎస్పీ దేవప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



కుమారుడితో కలసి అమ్మవారికి పూజలు చేస్తున్న ఎస్పీ దీపిక

పాల వాహనాన్ని ఢీకొన్న వ్యాన్

ఆరుగురు భవాని భక్తులకు గాయాలు

ఏలూరు, న్యూస్‌టుడే: రహదారి పక్కన నిలిపి ఉన్న పాల వాహనాన్ని భవానీ భక్తులు ప్రయాణిస్తున్న వ్యాన్ ఢీకొనడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ముకుందరాజుపేటకు చెందిన ఎనిమిది మంది భవాని భక్తులు ఓ వ్యానులో విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి వెళ్తున్నారు. మార్గం మధ్యలోని ఏలూరు నగర శివారు ఆశ్రం సమీపాన జాతీయ రహదారిపై ఆదివారం రోడ్డు పక్కన ఆపి ఉన్న పాల వాహనాన్ని వ్యాన్ ఢీకొంది. ప్రమాదంలో ఆరుగురు భవానీలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ముగ్గురు తీవ్రంగా గాయపడగా.. వారిని మెరుగైన వైద్య సేవల నిమిత్తం విజయవాడ తీసుకెళ్లారు. బాధితుల్లో ఒకరైన చెప్పా మాలశ్రీ ఫిర్యాదు మేరకు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన భవానీ భక్తులకు మెరుగైన వైద్య సేవలందించాలని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కోరారు. ప్రమాద బాధితులకు అండగా ఉండాలని స్థానిక భాజపా నేతలకు సూచించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



బోదులూరులో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ గోపాలకృష్ణ

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: గిరిజన గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని, ఇటువంటి వారంతా శిక్షలు అనుభవించాల్సిందేనని మారేడుమిల్లి సీఐ సీహెచ్ గోపాలకృష్ణ హెచ్చరించారు. చట్లవాడ పంచాయతీ పరిధి బోదులూరులో ఆదివారం గిరిజనులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల మీదుగా గంజాయి, నాటుసారా వంటి మత్తు పదార్థాల రవాణా ఎక్కువైందని, ఇటువంటి చట్టవ్యతిరేక పనులకు పాల్పడే వారి సమాచారాన్ని పోలీసులకు అందించాలని కోరారు. జంతువులను వేటాడటం క్షమించరాని నేరమని, ఇందుకు కఠిన శిక్షలు తప్పవన్నారు. ఎస్సై పి.రాము, పోలీసు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

రహదారి ప్రమాదాలపై అప్రమత్తం

దేవీపట్నం, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదాలపై యువత అప్రమత్తంగా ఉండాలని దేవీపట్నం ఎస్సై షరీఫ్ అన్నారు. వి.రామన్నపాలెంలో ఆదివారం రహదారి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రుణాల పేరుతో ఆన్‌లైన్ మోసాలు అధికంగా జరుగుతున్నాయని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాహనచోదకులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించి వాహనాలు నడపాలన్నారు. గ్రామంలోని యువకులతో ఆయన మాట్లాడారు. క్రీడల్లో మంచి విజయాలను సాధించడం ద్వారా ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. ఇందుకూరుపేట పరిసర ప్రాంతాల్లో సారా బట్టీలపై దాడిచేసి వంద లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు.

20 లీటర్ల సారాతో ఇద్దరి అరెస్టు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగి పంచాయతీ శ్రీరామ్‌నగర్ శివారు రక్షిత అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న సారా బట్టీపై దాడి చేసి శ్రీరామ్‌నగర్, వట్టిగెడ్డకు చెందిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఇ.నరసింహమూర్తి శనివారం తెలిపారు. వారి నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు.

నేటి నుంచి వైద్య కళాశాల తరగతులు

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ తరగతులు సోమవారం నుంచి ప్రారంభించడానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఈ కళాశాలలో 50 ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి కేంద్ర వైద్య మండలి అనుమతిచ్చిన విషయం తెలిసిందే. డాక్టర్ ఎన్టీఆర్ వర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఈ ఏడాది నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఇప్పటికే ఈ కళాశాలలో 42 మంది విద్యార్థులకు ప్రవేశం పొందారు. ఈ నెలాఖరులో మూడో విడతలో మరో 8 మంది ప్రవేశం పొందనున్నారు. అడవి బిడ్డలక ఆరోగ్య సేవలు మరింత చేరువకానుండటంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పాడేరు వైద్య కళాశాల

సర్వం సిద్ధం: వైద్య కళాశాలలో తరగతులు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. 50 మంది విద్యార్థులకు సబంధించి వసతి, భోజనశాలలతో పాటు తరగతి గదుల నిర్మాణాలు పూర్తయ్యాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హేమలతదేవి తెలిపారు.



సెమినార్ గ్యాలరీ

క్రికెట్ టోర్నీ విజేత బలిరెడ్డి జట్టు

రావికమతం, న్యూస్‌టుడే: రావికమతం ప్రీమియర్ లీగ్ (ఆర్‌పీఎల్) క్రికెట్ టోర్నీ విజేతగా బలిరెడ్డి ప్రసాద్ జట్టు నిలిచింది. దసరా సందర్భంగా గ్రౌండ్ బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో జడ్పీ హైస్కూలు మైదానంలో ఈ నెల 6 నుంచి 13 వరకు క్రికెట్ టోర్నీ సీజన్-1 పోటీలు జరిగాయి. రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల్లోని ఎనిమిది జట్లు పాల్గొన్నాయి.

గీతం దూర విద్యా కోర్సుల్లో ప్రవేశాలు


విశాఖపట్నం, న్యూస్‌టుడే: గీతం డీమ్డ్ వర్సిటీకి అనుబంధంగా సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో దూర విద్యా విధానంలో 2024 విద్యా సంవత్సరానికి ఎంఏ ఇంగ్లిష్, బీఏ, బీకామ్ డిగ్రీ కోర్సుల్లో చేరడానికి ప్రవేశాలు కల్పిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో సూచనల మేరకు ప్రవేశ దరఖాస్తు తేదీలను పొడిగించినట్లు పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను వచ్చే నెల (నవంబరు) 15వ తేదీలోగా అందజేయాలన్నారు. వివరాలకు దొండపర్తిలోని గీతం సిటీ సెంటర్‌ను సంప్రదించాలని, ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం గీతం సీడీఎల్ వెబ్ సైట్ cdl.gitam.edu ను పరిశీలించవచ్చన్నారు.

22న రైతాంగ సదస్సు

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయ రంగంలో ఉత్తరాంధ్ర రాష్ట్రంలో 13వ స్థానంలో ఉందని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకా సత్యనారాయణ పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు సాధనకు రైతాంగాన్ని సన్నద్ధం చేసేందుకు ఈ నెల 22న అనకాపల్లి రోటరీ హాల్‌లో ప్రాంతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ఆదివారం చెప్పారు. ఈ ప్రాజెక్టుకు వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇది పూర్తయితే ఉత్తరాంధ్రలో ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు, 1200 గ్రామాలకు తాగునీరు అందుతుందన్నారు.

తీరంలో చేపల మృత్యువాత

నక్కపల్లి, న్యూస్‌టుడే: పెదతీనార్ల పంచాయతీ పరిధిలోని దొండవాక తీరంలో చేపలు మృత్యువాత పడ్డాయి. కొన్ని ఒడ్డుకు చేరగా, మరికొన్ని నీటిలో తేలుతూ కనిపించాయి. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు మత్స్యకారులతో కలిసి ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెటెరో మందుల పరిశ్రమ కాలుష్యం కారణంగానే చేపలు మృత్యువాత పడ్డాయని ఆరోపించారు. కాలుష్య నియంత్రణ, మత్స్యశాఖ అధికారులు విచారణ చేసి, బాధ్యులపై చర్యలు చేపట్టాలని మత్స్యకారులకు నష్ట పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు జి.సోమేశ్వరరావు, బి.నూకరాజు, కె.కాశీరావు, సీహెచ్ సోమేశ్, గుర్రన్న, కె.కాశీ తదితరులు పాల్గొన్నారు.



చనిపోయిన చేపలను చూపుతున్న నాయకులు

16 ట్రావెల్స్ బస్సులపై కేసులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్సులపై రవాణాశాఖ అధికారులు పలుచోట్ల తనిఖీలు నిర్వహించారు. పండగ ముగిసిన సందర్భంగా ఊర్లకు వెళ్లిన వారు తిరుగు ప్రయాణం అవుతుండటంతో నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న 16 బస్సులపై కేసులు నమోదు చేసినట్లుగా డీటీఓ జి.ఆదినారాయణ తెలిపారు. ఇప్పటి వరకు 50 బస్సులపై కేసులు నమోదు చేసి 9 బస్సులను సీజ్ చేసినట్లుగా తెలిపారు. మరో రెండు రోజుల పాటు ఇలాగే తనిఖీలు కొనసాగుతాయన్నారు.

కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: కడుపు నొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విభీషణరావు తెలిపారు. విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కొవ్వాడకు చెందిన లంకా అప్పలనాయుడు నక్కపల్లి హెటిరో పరిశ్రమలో పనిచేస్తూ, భార్య మౌనిక (26)తో కలిసి తిమ్మాపురంలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం సాయంత్రం మౌనికకు తీవ్రమైన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొద్దిసేపటికి విధుల నుంచి ఇంటికి వచ్చి చూసిన అప్పలనాయుడు మౌనికను అడ్డురోడ్డులోని ప్రైవేట్ ఆసుపత్రికి, అక్కడి నుంచి తునికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మరణించింది. దీనిపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు తహసీల్దార్ రమేష్‌బాబు సమక్షంలో పంచనామా నిర్వహించారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అనుమానంతో భార్యను నరికిచంపిన భర్త

హుకుంపేట, న్యూస్‌టుడే: అనుమానంతో భార్యను భర్త నరికి చంపిన ఘటన హుకుంపేట మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఒడిశా రాష్ట్రంలోని నందాపూర్ గ్రామం నుంచి భర్త కిమ్ముడు పనో, అతని భార్య లబ్బ రెండేళ్ల క్రితం మండలంలోని మఠం పంచాయతీ గన్నెరుపుట్టు గన్నెరుపుట్టు గ్రామానికి వచ్చి ఇక్కడే కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నారు. భార్య వివాహేతర సంబంధం పెట్టుకొందని అనుమానంతో భర్త ఆదివారం ఆమెను నరికి చంపి కొండపైకి పారిపోయాడు. విషయం తెలుసుకున్నా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కొండపైకి వెళ్లి గాలించి నిందితుడిని పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సన్యాసినాయుడు పేర్కొన్నారు.

చికెన్ ధరలు (కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	125	122
లైవ్	147	142
డ్రెస్‌డ్	213	254
స్కిన్‌లెస్	243	264

పర్యటకులతో మర్యాదగా నడచుకోండి

అరకులోయ, న్యూస్‌టుడే: ఆంధ్రా ఊటీ అరకులోయని సందర్శించే పర్యటకులతో లాడ్జిలు, హోటళ్ల నిర్వాహకులు మర్యాదగా నడుచుకోవాలని పాడేరు డీఎస్పీ వేణుగోపాల్ అన్నారు. అరకులోయలోని హోటళ్లు, ప్రైవేట్ లాడ్జిల నిర్వాహకులతో మీ కోసం - మీ పోలీస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యటకుల క్షేమమే పరమావధిగా ఉండాలన్నారు. అరకులోయకి ఉన్న మంచి పేరుని నిలబెట్టేలా నిర్వాహకులు చూసుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారిని గుర్తించినా, అనుమానాస్పద వ్యక్తులపై సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని కోరారు. సీఐ హిమగిరి, ఎస్ఐ గోపాలరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ వేణుగోపాల్

పనిచేయని పథకం... తాగునీటికి తప్పని ప్రయాణం

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: తాగునీటి పథకం ఉన్నా పనిచేయకపోవడంతో గిరిజనులు నీళ్ల కోసం సుదూరం ప్రయాణించాల్సి వస్తోంది. గూడెంకొత్తవీధి మండలం రింతాడ పంచాయతీ టేకులవీధిలో నీటి పథకం ఉన్నా మోటారు మరమ్మతులు కారణంగా వారం రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో అక్కడి గిరిజనులు సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని ఊట నీటిని తెచ్చుకునే పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి మంచినీటి పథకం మరమ్మతు చేయాలని గిరిజన మహిళలు కోరుతున్నారు.


బిందెలతో నడిచి వెళ్తున్న టేకులవీధి మహిళలు

అరకులోయలో జల్లులు

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయలో ఆదివారం సాయంత్రం వర్షం కురిసింది. సాధారణంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారి జల్లులు కురవడంతో గంటపాటు ప్రధాన రోడ్లపై వాహన రాకపోకలు నిలిచిపోయాయి. మూడు రోజులుగా ఉదయం పొగమంచుతో శీతాకాల వాతావరణ తలపిస్తుండగా తొమ్మిది గంటల నుంచి సాయంత్రం వరకు మండుటెండలు ఇబ్బంది పెడుతున్నారు. ఆదివారం రోజంతా ఇదే వాతావరణం ఉండగా సాయంత్రం అయిదు గంటల ప్రాంతంలో ఒక్కసారిగా వచ్చిన వర్షంతో పర్యటకులు ఇబ్బందులు పడ్డారు.

భిన్న వాతావరణం.. ఎండలకు చనిపోతున్న మొక్కలు | సాగని వ్యవసాయం

అన్నదాతల్లో ఆందోళన

కూనవరం, న్యూస్‌టుడే: విలీన మండలాల్లో వ్యవసాయం దేవుడిపై భారం వేసి చేయాల్సిన నిస్సహాయ స్థితికి నెలకొంది. ప్రకృతిలో వస్తున్న మార్పులకు తోడు.. పోలవరం బ్యాక్ వాటర్ రైతులకు శాపంగా మారింది. ఏడాదికి మూడు సార్లు వరదలు వస్తుండటంతో పంటలు సకాలంలో వేయలేక రెండు నెలలు ఆలస్యంగా సాగు మొదలు పెట్టాల్సి వస్తుంది. అదును దాటిన తరువాత వేస్తున్న పంటలకు ఆశించిన దిగుబడులు లేక రైతులు అప్పుల పాలవుతున్నారు. వరదలకు తోడు వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో రకరకాల తెగుళ్ల పంటలను ఆశించి కర్షకుల ఆశలపై నీళ్లు చల్లుతున్నాయి.


మిర్చి తడుపులో కూలీలు

నాలుగు మండలాలకు వ్యవసాయమే ఆధారం

కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక, చింతూరు మండలాలకు వ్యవసాయమే ప్రధాన ఆధారం. ఈ నాలుగు మండలాలకు అనుసంధానంగా శబరి, గోదావరి నదులు ప్రవహిస్తున్నా సాగుకు వర్షాలే ఆధారం. ఖరీఫ్, రబీ కలిపి కూనవరంలో సుమారు 6,200 హెక్టార్లు, వీఆర్‌పురంలో 3,100 హెక్టార్లు, ఎటపాకలో 7,200 హెక్టార్లు, చింతూరులో 6,800 హెక్టార్లలో పంటలు సాగవుతుంటాయి. వరి, జొన్న, కంది, పెసర, మినుముతోపాటు వాణిజ్య పంటలైన మిర్చి, లంక పొగాకు, మొక్కజొన్న, పత్తి పంటలను సాగు చేస్తుంటారు. ఏటా ఖరీఫ్‌లో ఆరంభం కావాల్సిన సాగు పనులు గోదావరి వరదల ప్రభావంతో అక్టోబర్ నెలలో మొదలు పెట్టాల్సి వస్తోంది. ఆలస్యంగా వేస్తున్న పంటలపై పెరుగుతున్న ఉష్ణోగ్రత ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఎండల తీవ్రతకు వేసిన మొక్కలు చనిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. రెండు రోజులు విపరీతమైన ఎండలు కాసి అకస్మాత్తుగా భారీ వర్షం కురుస్తుండటంతో సాగు గందరగోళంగా మారుతోంది. ఈ ఏడాది వరదలు, తుపానుల నేపథ్యంలో రైతులు సాగు పనులు ఇప్పుడిప్పుడే మొదలు పెట్టారు. బీడులుగా ఉన్న భూములను దుక్కులు చేసి సాగుకు సిద్ధం చేస్తున్నారు. ముందుగా పనులు చేసుకున్న కొందరు రైతులు వేసిన పంటల్లోని మొక్కలు ఎండల తీవ్రతకు చనిపోతున్నాయి. ఆలస్యంగా కట్టిన నారుమడుల్లోని మొక్కల ఎదుగుదలలోనూ ఆశించిన వృద్ధి కన్పించడం లేదు. వారం రోజులుగా ఏ క్షణంలో వర్షం వస్తుందో.. ఏ క్షణంలో ఎండ కాస్తుందో అర్థంకాని పరిస్థితి రైతులకు ఎదురవుతోంది. దీనికి తోడు మూడేళ్లుగా రైతులు వాతావరణం సహకరించక నష్టాలనే చవిచూడాల్సి వచ్చింది. పంటలు కాపాడుకోవడానికి అదనపు పెట్టుబడులు తప్పని పరిస్థితి. పంటలను ఆశించిన తెగుళ్ల నివారణకు, వర్షాలు లేక తడులు పెట్టడానికి ఇలా అదనపు ఖర్చు పెరిగిపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఈ ఏడాది కూడా వాతావరణ శాఖ నుంచి తుపానుల సమాచారాన్ని ముందుగానే తెలుసుకోవడంతో సాగు జరుగుతుందా అన్న సందిగ్దంలో అన్నదాతలు ఉన్నారు. ఇప్పటికే ఖరీఫ్ మొదట్లో వరి పంటలు వేసిన కొందరు రైతులు వరదల్లో తమ పంటలు కోల్పోయారు. పంటలు చేతికందే సమయంలో తుపాను రావడంతో ఏటా దిగుబడులు కోల్పోయి నష్టాలు చూస్తున్న సాగుదారులు ఈ ఏడాదైనా దేవుడు కరుణిస్తాడులే అన్న నమ్మకంతో సాగుకు ఉపక్రమిస్తున్నారు.



ఆలస్యంగా వేసిన నారుమడులు, ఎండలకు చనిపోయిన మిర్చి మొక్క

అ వీ ఇ వీ

వాల్మీకి జయంతి నిర్వహణపై హర్షం

రంపచోడవరం, న్యూస్‌టుడే: వాల్మీకి మహర్షి జయంతిని ఈ నెల 17న అధికారికంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలివ్వడంపై ఆదివాసీ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బోండ్ల వరప్రసాదరావు హర్షం వ్యక్తం చేశారు. వాల్మీకి మహర్షి జయంతిని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, సచివాలయాల్లో అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు.

మైక్‌సెట్ వితరణ

కొయ్యూరు, న్యూస్‌టుడే: బట్టపనుకుల పంచాయతీ తీగెలమెట్ట గ్రామంలోని గ్రామదేవత తలుపులమ్మ తల్లి ఆలయానికి నడింపాలెం గ్రామానికి చెందిన పందల బాబ్జి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ.50 వేల విలువ చేసే మైక్ సెట్, సౌండ్ బాక్సులను వితరణగా అందించారు. శివ కుటుంబానికి స్థానికులు, గ్రామ పెద్దలు పాలపర్తి నాగు, పందల నానాజీ, గోవింద్ కృతజ్ఞతలు తెలిపారు.

జీవో నం. 3పై స్పష్టత ఇవ్వండి

కూనవరం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం జీవో మూడుపై స్పష్టత ఇచ్చిన తరువాతనే డీఎస్సీ ప్రకటించాలని ఆదివాసీ నిరుద్యోగులు కోరారు. కోతులగుట్టలో ఆదివారం నిర్వహించిన ఆదివాసీ నిరుద్యోగుల సమావేశంలో ఆదివాసీ వైద్యారోగ్య ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తుష్టి జోగయ్య మాట్లాడారు. స్పష్టత ఇవ్వకుంటే ఎంపీ, ఎమ్మెల్యే ఇళ్లు ముట్టడిస్తామన్నారు. యూటీఎఫ్ నాయకుడు కన్నారావు, పాయం వెంకటేశ్, వెట్టి వినోద్, విశ్వంత్‌కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

జూద స్థావరంపై పోలీసుల దాడి

ఎటపాక, న్యూస్‌టుడే: మండలంలోని క్రిష్ణవరంలో వాగు దాటిన తర్వాత శివారు ప్రాంతంలో నిర్వహిస్తున్న జూద గృహాలపై ఆదివారం ఎటపాక సీఐ కన్నపరాజు, ఎస్ఐ పార్థసారథి ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో అయిదుగురు జూదరులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.3200 నగదు, రెండు కోడి పుంజులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా జూదాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

300 మందికి వైద్య పరీక్షలు

రంపచోడవరం, న్యూస్‌టుడే: మండలంలోని సిరిగిందలపాడులో ఆదివారం రామకృష్ణమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 300 మంది రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు రామకృష్ణమిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనంద మహరాజ్ తెలిపారు. శిబిరంలో వైద్యులు టి.వి సుబ్బారావు, దాసరి ఉమామహేశ్, రాయుడు శ్రీనివాస్ సంపత్‌కుమార్ రోగులకు పరీక్షలు చేశారు. శిబిరంలో వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రాలయం నిర్వహించిన కంటి వైద్యశిబిరంలో 65 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 16 మందికి కళ్లజోళ్లు అందజేసినట్లు తెలిపారు. రోగులతోపాటు వెంట వచ్చిన వారికి భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో క్యాంపు కో ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాసు, వాలంటీర్లు చంటిబాబు, దాసరి పెదఅప్పారావు, అయినంపూడి సూర్యవర్మ పాల్గొన్నారు.

'ఆదివాసీ చట్టాలు తుంగలోకి తొక్కుతున్న అధికారులు'

ఎటపాక, న్యూస్‌టుడే: ఏజెన్సీలోని ఆదివాసీ చట్టాలను తుంగలో తొక్కే అధికారులను విధుల నుంచి తొలగించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా డివిజన్ నాయకులు సాయన్న డిమాండ్ చేశారు. శ్రీరాంనగర్ కాలనీలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ చట్టాలకు లోబడి దేవస్థానం భూమిని పేదలకు ఇవ్వాలని, దీనిలో భాగంగానే శ్రీరాంనగర్ కాలనీ, దమ్మక్కగూడెం లోని ఆదివాసీ పేద గిరిజనులు, ఇతరులు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. సమావేశంలో శివ, ప్రశాంత్, పార్వతి పాల్గొన్నారు.


ఇంటిపన్నులు, కరెంటు బిల్లులు చూపిస్తున్న ఆదివాసీ కుటుంబాలు


హుకుంపేటలో మహిళల కోలాటం


మోతుగూడెం లక్ష్మీ గణపతి దేవస్థానంలో..


పాడేరులో దుర్గాదేవి ఊరేగింపు


చింతపల్లి సాయినగర్‌వీధిలో...


అరుకులో ముళ్లకంప ఊయలలో గిరిజనులు

ఘనంగా విజయదశమి వేడుకలు

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా దసరా శరన్నవరాత్రులు శని, ఆదివారాల్లో అమ్మవారి విగ్రహాల నిమజ్జనంతో ఘనంగా ముగిశాయి. పాడేరు పాత ఆసుపత్రి, ఆర్టీసీ కాంప్లెక్సు ప్రాంతాల్లో ఈ వేడుకలు నిర్వహించారు. పురాతన ఉమానీలకంఠేశ్వర స్వామి సన్నిధిలో కొలువైన రాజరాజేశ్వరిదేవి వద్ద పాడేరు ఆధ్యాత్మిక బృందం సభ్యులు కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, రామారావు, రత్నం ఆధ్వర్యంలో దుర్గాదేవి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాత పాడేరు గ్రామంలో వంశ పారంపర్యంగా వచ్చిన దుర్గాదేవి పూజను స్థానిక భక్తులు వైభవంగా జరిపారు. సూకూరు పుట్టు, డొ.గొందూరు భక్తులు దుర్గాదేవి నిమజ్జనం చేశారు..

డుంబ్రిగుడ, హుకుంపేట, ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: డుంబ్రిగుడ మండలం అరుకులో దుర్గాదేవి ఆలయ అర్చకుడు సూరజ్ త్రివేది ఆధ్వర్యాన విజయదశమి వేడుకలు గిరిజనులు జరుపుకొన్నారు. హోమంతోపాటు ప్రత్యేక ముళ్లకంప ఊయలలో గిరిజన భక్తులు సేదతీరి భక్తి భావాన్ని చాటుకున్నారు. హుకుంపేటలోని అమ్మవారిని ఊరేగించి చీడిపుట్టు గెడ్డలో నిమజ్జనం చేశారు. సుమారు 200 మంది వరకు భవానీ మాలధారులు ప్రత్యేక వాహనాల్లో విజయవాడ కనకదుర్గను దర్శించుకునేందుకు వెళ్లారు. ఆంధ్రా - ఒడిశా సరిహద్దులోని ఒనకడిల్లీలో ఆదివాసీ నాటకం, ప్రత్యేక బ్యాండ్ ఏర్పాటు చేశారు. కోరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చింతపల్లి/గ్రామీణం, న్యూస్‌టుడే: అంతర్ల, వంగసారలలో నెలకొల్పిన దుర్గాదేవి మండపాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చింతపల్లి సాయి నగర్‌వీధి, రంగా కూడలిలోని దుర్గమ్మతల్లి విగ్రహాలకు కుంకుమ పూజ, ప్రత్యేకపూజలు నిర్వహించారు. లంబసింగి పంచాయతీ చీకటిమామిడి గ్రామంలో పర్యాటక శాఖ మేనేజర్, ఎస్ఏఎన్ ఛారిటీ ఫౌండర్ సూరిశెట్టి అప్పలనాయుడు ఆధ్వర్యంలో సుమారు 300 గిరిజన కుటుంబాలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ సర్పంచి రఘునాథ్, గ్రామపెద్ద నూకరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కొయ్యూరు: కొయ్యూరు, సింగవరం, రేవళ్లు, మంప, మర్రివాడ తదితర గ్రామాల్లోని కనకదుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాలను డప్పులు, నృత్యాలు మధ్య ఊరేగించారు. జీసీసీ మాజీ ఛైర్మన్ ఎంవీవీ ప్రసాద్, సర్పంచి బాలరాజు, తెదేపా మండల కార్యదర్శి దొరబాబు, భాజపా నేత చక్రరావు పాల్గొన్నారు.


సీలేరులో..


సింగవరంలో అమ్మవారి విగ్రహ ఊరేగింపులో యువతుల కోలాటం


వట్టిగెడ్డలో..

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరులో దుర్గామండపం వద్ద సందడి నెలకొంది. జలవిద్యుత్కేంద్రంలో, జెన్‌కో కార్యాలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధారకొండలోని ధారాలమ్మ ఆలయం వద్ద దసరా సందర్భంగా శని, ఆదివారాల్లో సందడి వాతావరణం నెలకొంది.

రంపచోడవరం, న్యూస్‌టుడే: స్థానిక మార్కెట్‌వీధి, స్టేట్ బ్యాంకు వద్ద ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని పురవీధులలో ఊరేగించిన అనంతరం ఆలయంలో శమీ పూజలను నిర్వహించారు. స్థానిక సాయిబాబా, వేంకటేశ్వరుని ఆలయాల్లో కూడా విజయదశమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీతపల్లి బాపనమ్మతల్లి ఆలయంలో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈవో గండేపూడి సత్యరమేష్, ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ పండా చెల్లన్నదొర(బాబీ) ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ కమిటీ ప్రతినిధి బత్తిన శ్రీను పాల్గొన్నారు.

మోతుగూడెం, న్యూస్‌టుడే: లోయరు సీలేరు ప్రాజెక్టు పరిధిలోని దుర్గమ్మ దేవాలయాల్లో అర్చకస్వాములు కుమార్ స్వామి శర్మ, పవన్ కుమార్, నెమలి శ్రీనివాసరావులు విశేష పూజలు నిర్వహించారు. పొల్లూరు శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని జమ్మిచెట్టుకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోతుగూడెం లక్ష్మీగణపతి దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహ నిమజ్జనోత్సవం ఘనంగా జరిగింది.

ఎటపాక, రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: అమ్మవారు శ్రీరాజ రాజేశ్వరి దేవిగా దర్శనమిచ్చారు. తోటపల్లి, ఎటపాక, నెల్లిపాక, చోడవరం తదితర గ్రామాల్లో ఆట పాటలతో అమ్మవారిని నిమజ్జనం చేశారు. రాజవొమ్మంగిలో రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దూసరపాము, వట్టిగెడ్డ, జడ్డంగి, చెరుకుంపాలెం, చికిలింత, అమీనాబాద్, బడదనాంపల్లి, శరభవరం, కొండపల్లి, లబ్బర్తి, లాగరాయి, కింద్ర తదితర గ్రామాల్లో దుర్గాదేవికి భక్తులు విశేష పూజలు చేశారు. అన్నసమారాధనలు నిర్వహించారు.

దేవీపట్నం, న్యూస్‌టుడే: గండిపోశమ్మను ఆదివారం కొండపై నుంచే భక్తులు దర్శించుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. వారం రోజులుగా గోదావరిలో క్రమంగా నీటి మట్టం తగ్గుతోంది. అమ్మవారి ఆలయంలో పూర్తిగా వరద నీరు తగ్గింది. త్వరలోనే అమ్మవారి ఆలయం వద్ద సంప్రోక్షణ కార్యక్రమాలు అనంతరం అమ్మవారి దర్శనాలు ప్రారంభం అవుతాయని స్థానికులు చెబుతున్నారు.

మారేడుమిల్లిలో భారీగా అయ్యప్ప మాలధారణలు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లిలో అయ్యప్పస్వామి భక్తులు భారీగా మాలధారణలు చేశారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని మారేడుమిల్లితోపాటు, లోతట్టు గిరిజన గ్రామాలకు చెందిన అనేక మంది అయ్యప్ప మాల ధారణలతో దీక్షలు చేపట్టారు. మారేడుమిల్లికి చెందిన పుత్సల వీరన్న గురుస్వామి ఆధ్వర్యంలో వారంతా మాలలను ధరించి, పూజలను ప్రారంభించారు.


మారేడుమిల్లిలో అయ్యప్ప మాలధారుల పూజలు


సీతపల్లిలో బాపనమ్మతల్లి గ్రామోత్సవం


తోటపల్లిలో అమ్మవారి ఊరేగింపు

పాడేరులో ఫిరంగులకు ఆయుధ పూజ

పాడేరు, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా ఆయుధ పూజ నిర్వహించడం ఇక్కడి గిరిజనులకు పూర్వం నుంచి వస్తున్న ఆచారం. పాడేరు మండలం కొత్తపాడేరులో బ్రిటిష్ కాలంలో ముఠాదర్లు వ్యవస్థలో వాడిన ఆయుధాల ఫిరంగులు, బాణాలు, నాటి యుద్ధసామగ్రికి ఆయుధ పూజలు చేశారు. గిరిజన సంప్రదాయాల ప్రకారం పండుగ నిర్వహించారు.


కొత్తపాడేరులో బ్రిటిష్ కాలం నాటి ఫిరంగులను అలంకరించిన భక్తులు

ఎండిన చెట్టు.. పట్టించుకోకుంటే ముప్పు..

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి నుంచి రాజమహేంద్రవరం వెళ్లే ప్రధాన రహదారిలోనే సున్నంపాడు సమీపాన రహదారి పక్కనే ఎండిపోయిన చెట్టు ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ రహదారి మీదుగా నిత్యం వందలాది వాహనాలు, పర్యటకులు, లోతట్టు గ్రామాల ప్రజలు తిరుగుతూనే ఉంటారు. అంతర్రాష్ట్ర రహదారి కావడంతో జిల్లాలోని విలీన మండలాలతోపాటు, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. మారేడుమిల్లి మండలంలోని గ్రామాలతోపాటు, వై.రామవరం మండలం ఎగువ ప్రాంతంలోని గ్రామాలకు ఇదే రహదారిపై ప్రయాణిస్తూ వెళ్లాల్సి ఉంది. ఇంతటి ప్రధాన మార్గంలో ఎండిపోయిన చెట్టు వల్ల ఎటువంటి ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి దీన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.


సున్నంపాడులో రహదారి పక్కనే ప్రమాదకరంగా ఉన్న ఎండిన చెట్టు

నేటి నుంచి పల్లె పండగ

పాడేరు, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు అక్టోబర్ 14 నుంచి పల్లె పండగ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆగస్టు 23న ఒకేరోజు జిల్లాలోని 430 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించామన్నారు. పల్లె పండగ సందర్భంగా గ్రామసభల్లో తీసుకున్న అర్జీలు పరిష్కారం, తీర్మానాల అమలు చేయాలన్నారు. సుమారు రూ. 413 కోట్లతో 900 పైగా వివిధ రకాల పనులను ప్రతిపాదించామని చెప్పారు. వీటికి భూమిపూజ కార్యక్రమాలు చేయాలని సూచించారు. సీసీ రోడ్లు, తారు రోడ్లు, వ్యవసాయ కుంటలు, పశువులశాలలు, ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. పౌర సమాచార బోర్డులు అందరికీ తెలిసేవిధంగా ఏర్పాటు చేయాలన్నారు. సోమవారం 138 గ్రామ పంచాయతీల్లో రూ. 12.4 కోట్లతో చేపట్టనున్న 211 పనులకు శంకుస్థాపన జరుగుతుందన్నారు. ఇందులో 28 సీసీ రోడ్లకు రూ. 3.98 కోట్లు, మూడు బీటీ రోడ్లకు రూ. 1.63 కోట్లు, నాలుగు డబ్ల్యూబీఎం రోడ్లకు రూ. 5.05 కోట్లు, నాలుగు సీసీ డ్రైనేజీలకు రూ. 0.17 కోట్లు, 66 ట్యాంకులకు రూ. 5.51 కోట్లు, ఏడు చేపల చెరువులకు రూ. 3.50 కోట్లు, 35 సామాజిక ఇంకుడు గుంతలకు రూ.13 లక్షలు, 64 రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ పథకాలకు రూ. 47 లక్షలలతో పనులు ప్రారంభం కానున్నాయని కలెక్టర్ వివరించారు.


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

అభివృద్ధి పనులతో పల్లెల్లో నిజమైన పండగ

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: అభివృద్ధి పనులతో పల్లెల్లో నిజమైన పండగను కూటమి ప్రభుత్వం తీసుకు వస్తోందని జనసేన మండల అధ్యక్షుడు కొయ్యం బాలరాజు, అరకు పార్లమెంట్ కన్వీనర్ గొర్లె వీర వెంకట్ ఆదివారం తెలిపారు. ప్రభుత్వం గ్రామాల్లో సమస్యలపై దృష్టిసారించి వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా గ్రామసభల ద్వారా సమస్యలు తెలుసుకుందన్నారు. తొలిరోజు రింతాడ, సంకాడ, వంచుల పంచాయతీల్లోని అసరాడ, వంచుల, కుమ్మరపల్లి గ్రామాల్లో పనులు ప్రారంభమవుతాయన్నారు.

కొయ్యూరు, న్యూస్‌టుడే: పల్లెపండగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెదేపా మండల అధ్యక్షుడు జి.సత్యనారాయణ కోరారు. ఈనెల 14 నుంచి ప్రతీ పంచాయతీలో అక్కడి కూటమి నేతలంతా పాల్గొనాలని కోరారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఎక్కడికక్కడ ప్రజలకు వివరించాలన్నారు.

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయ మండలంలోని గిరిజన గ్రామాల్లో నేటి నుంచి ఈనెల 20వ తేదీ వరకు పల్లెపండగ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లవరాజు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు చెప్పారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొనాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు 89853 66570, అరకులోయ 63034 86346, రంపచోడవరం 94908 77172

రంపచోడవరం, న్యూస్‌టుడే:

?: మండలంలోని జాగరంపల్లి నుంచి ఐ.పోలవరం వెళ్లే ప్రధాన రహదారిలో ఉద్యాన పార్కు ఎదురుగా పెద్ద పెద్ద గోతులుపడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

– వాహనదారులు, రంపచోడవరం.

✓: ఈ రహదారిపై పడిన గుంతలకు మరమ్మతులను చేయించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడతాం.

– ప్రదీప్, ఏఈ, ర.భ.శాఖ, రంపచోడవరం

మారేడుమిల్లి, న్యూస్‌టుడే:

?: మారేడుమిల్లి నుంచి పూజారి పాకలు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. రహదారి పూర్తిగా ఛిద్రమైన పెద్ద గోతులు పడిపోవడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి మరమ్మతులు చేయించాలి.

– పూజారి సుగ్గిరెడ్డి, పూజారిపాకలు

✓: మారేడుమిల్లి నుంచి పూజారిపాకలు రహదారిని పునర్నిర్మించడానికి అవసరమైన చర్యలు చేపడతాం. నిధులకు ఉన్నతాధికారులకు ప్రతిపాదిస్తాం. రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– వెంకటరమణ, మండల ఇంజినీరింగ్ అధికారి

అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలి

రంపచోడవరం, న్యూస్‌టుడే: సమాజంలో యువత అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని రంపచోడవరం సీఐ రవికుమార్ పిలుపునిచ్చారు. రంపచోడవరం మండలం బొర్నగూడెంలో ఆదివారం సాయంత్రం గంజాయి, సారా నిర్మూలనపై పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి విక్రయాలు, రవాణాలో యువత దూరంగా ఉంటూ తమకు సమాచారం అందజేయాలన్నారు. గంజాయి వ్యాపారుల మాటలను నమ్మి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఎస్సై షేక్ సాధిక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


బొర్నగూడెం అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ రవికుమార్

జి.మాడుగుల, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎస్సై షణ్ముఖరావు తెలిపారు. జి.మాడుగుల కొత్తూరు, సంతబయలు, బందవీధి, జి.మాడుగుల ప్రధాన కూడళ్లలో ఆదివారం సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. మత్తు పదార్థాలు తాగి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. మత్తు పదార్థాలు రవాణా చేయడం, తయారు చేయడం వంటివి చేస్తే కఠిన చర్యలు తప్పదని హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు.

సమాన పనికి సమాన వేతనం

చింతూరు, న్యూస్‌టుడే: గిరిజన హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న పొరుగు సేవల కార్మికులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నారని, అందుకు సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చింతూరులో ఆదివారం జరిగిన హాస్టల్ ఉద్యోగుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ ఉద్యోగులు రోజుకు 12 నుంచి 14 గంటలు వంట పనిచేస్తున్నారని, కానీ వారికి ఇచ్చే వేతనాలు మాత్రం అతి తక్కువగా ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం జీఓ ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సీనియారిటీ ప్రకారం సర్వీసు క్రమబద్ధీకరించి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని జిల్లా కమిటీ తరపున డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో సోడి దుర్గారావు, కొమరం వీరయ్య, చంద్రమ్మ, తిరుపతమ్మ, రాజమణి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్